

హయత్‌నగర్ వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ చామ కృష్ణారెడ్డి

భూమి వివరాలు ఈకేవైసీ చేయించుకోండి

● సహకార సంఘం చైర్మన్ చామ కృష్ణారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం హయత్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో చైర్మన్ చామ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలోని రైతులు తమ భూమి వివరాలను ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. భూమిలేని రైతుల సభ్యత్వం తొలగించడం జరుగుతుందన్నారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి పొందాలన్నారు. 2024-2025 జమ ఖర్చుల వివరాలను సంఘం సీఈవో మల్లికార్జున్ సభలో చదివి వినిపించారు. సంఘంలో సభ్యత్వం ఉండి చనిపోయిన రైతుల సభ్యత్వాన్ని తొలగించాలని రైతు కళ్లెం శంకర్‌రెడ్డి కోరారు. భూమిలేని రైతుల వివరాలను బయటపెట్టి సభ్యత్వం రద్దు చేయాలని రైతు బుచ్చిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో జోర్క శ్రీరాములు ముదిరాజ్, అంజయ్య, బండరావిరాల, చిన్న రావిరాల మాజీ సర్పంచులు సురకంటి శ్రీనివాస్‌రెడ్డి, కవాడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



జలమండలి అధికారులతో సమీక్షలో కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): లోప్రెషర్ కారణంగా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని, వేసవి కాలం సమీపించినందున ప్రతి కాలనీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ జలమండలి అధికారులను కోరారు. ప్రశాంత్‌నగర్‌లోని హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ కార్యాలయంలో శుక్రవారం జలమండలి అధికారులతో ఆమె వేసవి కాలం నీటి ఎద్దడి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అవసరమైన ప్రతి చోట తాగునీటి లైన్లతో పాటు డ్రైనేజీ లైన్లను సైతం వేయాలని, ఇది వరకు డ్రైనేజీ పనులు చేసిన కాలనీల్లో ప్యాచ్‌వర్క్‌లు తొందరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం మాధవి, మేనేజర్ అర్చన, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, ప్రేమ్‌సాగర్, ధనంజయ్, మునీందర్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

హయత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు వరం లాంటిదని మాజీ కౌన్సిలర్ కొశిక ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆయన కమ్మగూడ ఏపీఐటీ కాలనీకి చెందిన వినయ్‌కుమార్‌కు రూ.54వేల చెక్కు, సుభాష్‌నగర్‌కు చెందిన కళ్యాణ్‌రెడ్డికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన రూ.60వేల చెక్కులను తన కార్యాలయంలో అందజేశారు. వివిధ రుగ్మతలతో ఆస్పత్రిలో చేరిన వారికి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం చేయడం గొప్ప విషయం అన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వందలాది మంది పేదలకు సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని ఐలయ్య తెలిపారు. తుర్కయంజాల్‌కు చెందిన చెక్క సునీతకు మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.48వేల చెక్కును టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ మంగమ్మశివకుమార్ అందజేశారు.

మెరుగైన సేవలతోనే ఖాతాదారుల్లో తగిన గుర్తింపు

● ఎల్బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న డీసీపీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలందిస్తూ వారికి చేరువలో ఉన్న బ్యాంకులకు ప్రజల్లో తగిన గుర్తింపు ఉంటుందని ఎల్బీనగర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఫెడరల్ బ్యాంకు నాగోల్ బ్రాంచి నూతన కార్యాలయాన్ని శుక్రవారం బ్యాంకు జోనల్ హెడ్ బి.దిలీప్‌తో కలిసి ముఖ్యఅతిథిగా డీసీపీ ప్రవీణ్‌కుమార్, విశిష్ట అతిథులుగా లోటస్‌ల్యాప్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ల్యాండ్ మార్క్ గ్రూప్ ఇండియా సీఎండీ పల్లె రవీందర్‌రెడ్డిలు విచ్చేసి ప్రారంభించారు. డీసీపీ మాట్లాడుతూ ఎల్బీనగర్, నాగోల్ పరిసర ప్రాంతాల్లోని ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు వారికి చేరువలో ఫెడరల్ బ్యాంకు నూతన బ్రాంచి ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలిని వారియర్, రీజినల్ హెడ్ చార్లీ దేవస్య, బ్రాంచి హెడ్, మేనేజర్ గోవిరెడ్డి సునీత పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో బీఆర్ఎస్ నేతల పూజలు

చంపాపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ముదుప రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నేతలు ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వారు స్వామి వారికి సింధూర అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, ఆలయ మాజీ ధర్మకర్త అంజిరెడ్డి, నాయకులు గోగు శేఖర్‌రెడ్డి, బొంబాయి, ప్రభాకర్, యాదయ్య, శివగౌడ్, జగదీష్ గౌడ్, యాదగిరి, వసంతరెడ్డి, విద్యాసాగర్, కేశవరెడ్డి, రాజు పాల్గొన్నారు.

గృహిణి అదృశ్యం

హయత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గృహిణి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన శంకర్ ఆయన భార్య సురేఖలు బతుకుతెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి మునుగనూరులో నివాసం ఉంటున్నారు. శంకర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య ఇంటి వద్దనే ఉంటుంది. గురువారం శంకర్ డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం 3గంటలకు వచ్చాడు. అప్పటికే భార్య ఇద్దరు పిల్లలతో ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. శంకర్ తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను వ్యభిచారంలో దించిన నలుగురికి జైలుశిక్ష

హైదరాబాద్ సిటీ : ఓ బాలికను మాయమాటలతో లొంగదీసుకుని లైంగిక దాడికి పాల్పడడమే గాకుండా వ్యభిచార కూపంలోకి దింపిన నిందితులకు రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు యావజ్జీవశిక్ష, జరిమానా విధించింది. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో తల్లిదండ్రులను కోల్పోయి నానమ్మ సంరక్షణలో ఉంటున్న ఓ బాలికతో పరిచయం పెంచుకొని యార్లగడ్డ చంటి లొంగదీసుకున్నాడు. బాలికపై లైంగికదాడికి పాల్పడడంతో పాటు వ్యభిచార కూపంలోకి దించాడు. ఇందులో యార్లగడ్డ పుష్ప, కేతావత్ కృష్ణవేణి, గోదా మల్లేశ్వరిలను రంగారెడ్డి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. యార్లగడ్డ చంటికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.1.30లక్షల జరిమానా, యార్లగడ్డ పుష్పకు 10సంవత్సరాల కఠిన కారాగార శిక్ష రూ.30వేల జరిమానా, కేతావత్ కృష్ణవేణి, గోదా మల్లేశ్వరిలకు ఒక్కొక్కరికీ 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1.25లక్షల జరిమానా విధించారు. బాలికకు రూ.15లక్షలు, నిందితుల మూలంగా లైంగిక వేధింపులకు గురైన మరో బాధితురాలికి రూ.5లక్షలు అందించారు. న్యాయమూర్తి ఎంకె. పద్మావతి తీర్పు వెల్లడించగా, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సునీత, రఘు వాదనలు వినిపించారు.

భారత రక్షణ, ఏరోస్పేస్ చరిత్రలో మిధానీ సరికొత్త అధ్యాయం

చంపాపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మిధానీ కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని ప్రముఖ మెటలర్జికల్ ప్రభుత్వ రంగ సంస్థ బెంగళూరు వేదికగా ఫిబ్రవరి 10 నుంచి 14వరకు నిర్వహించిన ఏరో ఇండియా సదస్సులో కంచన్‌బాగ్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ ఉద్యోగులు పాల్గొని రక్షణ రంగంలో అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చి ఏరోస్పేస్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని మిధానీ ప్రకటనలో తెలిపింది. మిధానీ భారతదేశ రక్షణ, అంతరిక్ష పరిశోధనలో కీలకపాత్ర పోషించే విధంగా స్వదేశీ పరిజ్ఞానంతో పరికరాలను అభివృద్ధి చేసింది. అంతరిక్ష పరిశోధనలో అవసరమయ్యే సరికొత్త మూడు రకాల పరికరాలను ఏరో ఇండియా సదస్సులో ఆవిష్కరించినట్లు పేర్కొంది. అధిక ఉష్ణోగ్రత నికెల్ అల్లాయ్, బిల్లెట్ల్ అల్లాయ్ ఎస్152 ఫోర్గ్‌డ్ బార్లు, సుపర్ని 41ప్లేట్లు అధునాతన విమానాలు, జెట్ ఇంజన్ల తయారీ, అంతరిక్ష సాంకేతిక అభివృద్ధికి కీలకం కానున్నట్లు మిధానీ పేర్కొంది. భారత స్వదేశీ తేజస్ యుద్ధ విమానాలు తయారీ, అంతరిక్ష ప్రయోగాల్లో మిధానీ ప్రత్యేక ఉత్పత్తులైన అధిక సామర్థ్యం కల్గిన టైటానియం మిశ్రమ లోహాలు, నికెల్ ఆధారిత సూపర్ అల్లాయ్, అధిక శక్తి కల్గి తుప్పు నిరోధక స్టీల్‌ను భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాల్లో వినియోగించనున్నట్లు మిధానీ పేర్కొంది. ఏరో ఇండియా 2025 సందర్భంగా నిర్వహించిన సామర్థ్య కార్యక్రమంలో రెండు వ్యూహాత్మక మిశ్రమ లోహాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేయడంలో గణనీయమైన కృషి చేసినందుకు గాను మిధానీ సంస్థకు కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రత్యేక గుర్తింపు మెడల్స్‌ను అందజేసినట్లు మిధానీ పేర్కొంది. మిధానీ ఉద్యోగులను మంత్రి ప్రశంసాపత్రాలతో సత్కరించినట్లు మిధానీ సంస్థ మార్కెటింగ్ జీఎం ఏకే శర్మ పేర్కొన్నారు.



కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకుంటున్న మిధానీ ఉద్యోగులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ప్రోత్సహిస్తుంది : ఎమ్మెల్యే



కొహెడాలో గోదాంను, కోల్డ్‌స్టోరేజీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు రైతాంగాన్ని ప్రోత్సహిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో కొహెడాలో రూ.3కోట్ల 25లక్షలతో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం, 1500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల కోల్డ్‌స్టోరేజీని సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.32వేల కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. బహుశా దేశంలో ఎక్కడ చేయలేదని అన్నారు. గత ప్రభుత్వం రూ.7లక్షల కోట్లు అప్పుచేసి వెళ్లిందని పేర్కొన్నారు. సంపద సృష్టించి రైతుకు పంచాలని ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. సహకార సంఘం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై సంఘం దృష్టి సారించాలని కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకు సంఘం కొన్ని నిధులు కేటాయించాలని సూచించారు. తుర్కయంజాల్ సహకార సంఘం శాఖ నిర్మాణానికి 500 గజాల ప్రభుత్వ స్థలం చూపిస్తామని హామీ ఇచ్చారు. రైతులు పండించిన పంటను దాచుకోవడానికి ఉచితంగా గోదాంను ఇవ్వాలని కోరారు. సహకార సంఘం అభివృద్ధి కోసం టెస్కాబ్, నాబార్డు ద్వారా రుణాలు పొందవచ్చునని అన్నారు. త్వరలో కొహెడాలో రూ.4వేల కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించడానికి ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారని అన్నారు. సహకార సంఘ అధ్యక్షుడు కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ సహకార సంఘాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సహకార సంఘం రూ.350కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు కొత్త రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ సంరెడ్డి బాల్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు వంగేటి లక్ష్మారెడ్డి, సామ సంజీవరెడ్డి, జక్క కృష్ణారెడ్డి, శీలం లక్ష్మమ్మ, చాపల యాదగిరి, జ్యోతి, నాయకులు కొత్తకుర్మ మంగమ్మశివకుమార్, కొశిక ఐలయ్య, సీఈవో రాందాసు, బల్‌దేవ్‌రెడ్డి, ధన్‌రాజ్‌గౌడ్, సామ భీంరెడ్డి, శంకరయ్యగౌడ్ పాల్గొన్నారు.



న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ హయత్‌నగర్ కోర్టులో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

● సీనియర్ న్యాయవాది రామ్మోహన్

హయత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహిళా న్యాయమూర్తిపై గురువారం జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం హయత్‌నగర్ కోర్టులో బార్ అసోసియేషన్ నాయకులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది రామ్మోహన్ మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇలాంటి దాడులు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కక్షిదారులకు న్యాయం చేయడానికి కోర్టులు, న్యాయవాదులు పని చేస్తారని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రభాకర్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, ఇంద్రారెడ్డి, దయాకర్‌రెడ్డి, చంద్రకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎల్బీనగర్‌ను అభివృద్ధి చేస్తాం



కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి జనప్రియకాలనీలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న మధుయాష్కీగౌడ్

ఎల్బీనగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగానూ అభివృద్ధి చేస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి లింగోజిగూడ డివిజన్ పరిధిలోని జనప్రియకాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనప్రియకాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. కాలనీ నుంచి ప్రధాన రహదారికి కనెక్టివిటీ సమస్యను కూడా తీరుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇప్పటికే మీసేవా కేంద్రాల ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడం జరుగుతున్నదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి కవిత పరామర్శ



బాధితురాలిని పరామర్శిస్తున్న కవిత

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న తెలంగాణ జాగృతి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షురాలుని జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. శుక్రవారం సాయంత్రం మీర్‌పేట్‌లోని ప్రశాంతిహిల్స్‌లో నివసించే బాధితురాలి నివాసానికి చేరుకుని ఆమెతో మాట్లాడారు. ఆమె ఆరోగ్యం గురించి, తీసుకుంటున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం కుదుటపడి ఆమె మళ్లీ జాగృతిలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు కవిత ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు ఆర్కల కామేశ్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతాబాల్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ధనలక్ష్మీరాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేంద్రం కేటాయింపుల వివరాలివ్వండి

● బడంగ్‌పేట్ అధికారులకు దిశా కమిటీ సభ్యుడి వినతి



బడంగ్‌పేట్ ఏఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ తదితరులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న అనేక సంక్షేమ పథకాలకు, అభివృద్ధి పనులకు కేంద్రం తన వంతు సాయంగా నిధులు కేటాయిస్తున్నదని, అయినప్పటికీ రాష్ట్రంలోని అధికార పార్టీలు ఆ విషయాన్ని ప్రజలకు చేరనీయడం లేదని రంగారెడ్డి జిల్లా దిశా కమిటీ సభ్యుడు అంబోజీ శ్రీనివాస్ అన్నారు. ఈ దృష్ట్యా సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేంద్రం కేటాయిస్తున్న నిధులకు సంబంధించిన వివరాలు ఇవ్వాల్సిందిగా ఆయన మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్ అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డితో కలిసి అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అమృత్ మిషన్, పీఎం ఆవాస్‌యోజన, స్వచ్ఛ భారత్ తదితర పథకాలతో పాటు స్మార్ట్ సిటీస్ మిషన్ ద్వారా రాష్ట్రానికి కేంద్రం నుంచి విడుదలైన నిధుల సమగ్ర వివరాలు అందజేయాలని అంబోజీ శ్రీనివాస్ తన వినతిపత్రంలో కోరారు. కేంద్రం అందజేస్తున్న నిధులతో రాష్ట్రంలో అనేక పథకాలు కొనసాగుతున్నాయని, దిశా కమిటీ చైర్మన్, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారని ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి అక్కడ కేంద్రం అమలు చేస్తున్న పథకాల వివరాలు సేకరిస్తున్నట్టు చెప్పారు.

అష్టలక్ష్మీ ఆలయాన్ని దర్శించుకున్న త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భాష్యకార సిద్ధాంత పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య అనంత విభూషిత త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి కొత్తపేట వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. జీయర్‌స్వామికి ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీయర్‌స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జీయర్ స్వామి భక్తులకు అనుగ్రహ భాషనం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్‌కుమార్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, మాజీ చైర్మన్ మేడం సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్‌రెడ్డి, మాలే శ్రీనివాస్, గందె శ్రీకాంత్, మాలే అనిల్ పాల్గొన్నారు.

కత్తితో సంచరిస్తున్న రౌడీ షీటర్‌కు రిమాండ్

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కత్తితో సంచరిస్తున్న ఓ రౌడీ షీటర్‌ను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి కత్తి, పవర్ పంచ్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రైన్ బజార్ చమన్ నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన ఏసీ టెక్నీషియన్, రౌడీషీటర్ మహమ్మద్ నాజర్ అలియాస్ నాజర్‌ఖాన్(25) ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా ఒక కత్తితో పాటు పిడికిలి పంచ్ లభించింది.

దీంతో పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి కత్తి, పంచ్‌ను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఐ.ఎస్.సదన్ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

ఫోన్ విషయంలో వివాదం

● ఒకరిపై ఒకరు దాడి

● పరస్పరం ఫిర్యాదులు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఓ హోటల్ ఎదుట జరిగిన ఫోన్ గొడవ ఇరువర్గాల మధ్య దాడులకు దారితీసింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హస్తినాపురంలోని పంచాయతీరాజ్ కాలనీకి చెందిన సిద్ధాంతి వీరేశ్(26) స్థానికంగా గల ఓ ప్రైవేటు కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి డ్యూటీ ముగిసిన తర్వాత హస్తినాపురం జడ్పీ రోడ్డులోని దావత్ బిర్యానీ హోటల్ ముందు నుంచి వెళ్తుండగా, అదే సమయంలో హోటల్‌లో పని చేసే బీహార్‌కు చెందిన అభిషేక్‌దాస్ అనే వ్యక్తి ఎవరితోనో ఫోన్ మాట్లాడుతూ ఆవేశంగా తన ఫోన్‌ను నేలకేసి కొట్టాడు. అది కాస్తా వెళ్లి వీరేశ్ కాలికి తగలడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం వీరేశ్ సోదరుడు గౌరీ శంకర్ సైతం అక్కడకు చేరుకుని హోటల్‌లోకి వెళ్లి అభిషేక్‌తో మళ్లీ గొడవపడి పరస్పరం కొట్టుకున్నారు. దాంతో హోటల్‌లో పనిచేసే నవీన్‌కుమార్‌తో పాటు ఇతర సిబ్బంది సైతం కలిసి వీరేశ్, గౌరీశంకర్‌ను చితకబాదారు. హోటల్ మేనేజర్ సైతం కొట్టండంటూ తమ సిబ్బందిని ప్రోత్సహించాడు. ఈ దాడిలో సోదరులిద్దరికీ గాయాలవగా ఆస్పత్రిలో చేరారు. ఫోన్‌తో తన కాలుపై బలంగా కొట్టాడని, అదేమని అడిగినందుకు తమపై అకారణంగా దాడి చేశారని పేర్కొంటూ వీరేశ్ మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా తన ఫోన్‌ను తాను ఆవేశంలో నేలకేసి కొట్టానని, అది వీరేశ్ కాలుకు తాకలేదని, అనవసరంగా తన వద్దకు వచ్చి గొడవ పెట్టుకున్నారని పేర్కొంటూ అభిషేక్, నవీన్‌కుమార్‌లు సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులను స్వీకరించి విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

పుల్వామా అమరుల ఆశయ సాధనకు కృషిచేయాలి



హైకోర్టు కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవికిరణ్ తదితరులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల ఆశయ సాధనకు కృషిచేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికారి ప్రతినిధి రవికిరణ్ పొనుగుపాటి అన్నారు. బీజేపీ యూత్ నాయకులు సుమంత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి హయత్‌నగర్ డివిజన్ హైకోర్టుకాలనీ నుంచి వనస్థలిపురం రైతుబజార్ వరకు పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్ల ఆత్మ శాంతించాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికారి ప్రతినిధి రవికిరణ్ పొనుగుపాటి మాట్లాడుతూ దొంగచాటున భారత జవాన్లను హతమార్చిన ఉగ్రవాదుల వికృత చేష్టలు సహించరానివన్నారు. దేశం భద్రత కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన భారత జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని ఆకాక్షించారు. వారి ఆశయ సాధనకు దేశ పౌరులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు నిఖిల్, అఖిల్, సాకేత్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైబల్ టీచర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

చంపాపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రైబల్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శంకర్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, రాష్ట్ర కన్వీనర్ రాధాబాయి, శక్రునాయక్, యాదగిరి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హయత్‌నగర్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ కట్టమైసమ్మ కాలనీకి చెందిన సిరికొండ శివాజీ(31) డ్రైవర్‌గా పని చేస్తుండగా ఆయన భార్య ఇళ్లల్లో పాచి పనిచేస్తుంది. కొంతకాలంగా శివాజీ అప్పులు చేశాడు. దీంతో మనస్థాపానికి గురైన శివాజీ గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య వెంటనే శివాజీని ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతున్న శివాజీ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. శివాజీ భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టైలర్ షాపులో అగ్నిప్రమాదం

● తప్పిన పెను ముప్పు

● ఊపిరి పీల్చుకున్న కాలనీవాసులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో టైలర్‌షాపులో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్‌కాలనీలోని సాయిబాబ ఆలయం పక్కన గల సచివాలయనగర్‌లో రాములు (65) కొంత కాలంగా షెటర్‌ను అద్దెకు తీసుకుని టైలర్ షాపును నిర్వహిస్తున్నాడు. కాగా శుక్రవారం టైలర్‌షాపులో ఎవరులేని సమయంలో అకస్మాత్తుగా షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో షాపులో ఉన్న చిన్నసిలిండర్ పేలడంతో షాపులో ఉన్న రూ.25వేల విలువ కలిగిన సామగ్రి పూర్తిగా దగ్ధం అయ్యాయి.

ఆ సమయంలో షాపులో ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు ఫైర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకవచ్చారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



షాపులో కాలిబూడిదైన వస్తువులు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది